# 13

# దుప్పటి నీ మీద పడనియ్యుము

## (2 రాజులు 2)

జీవితంలో అనేక దశలు ఆయా గురుతులతోనూ అధికారపరంగాను గుర్తును కలిగి ఉంటాయి. పోలీసులకు యూనిఫాం, బాడ్జీలు సహజం. అంబులెన్స్ (ఆపద్బాంధవ వాహనం) డ్రైవర్ తన వాహనం చుట్టు జిగేలుమనే లైట్స్, పెద్ద శబ్దం చేసే సైరన్ తగిలించి యుంటాడు కొంతమందికి వారి అధికార చిహ్నాలు "మేనేజర్" అని తెలుపుతాయి.

ఏలీయాకైతే అతని దుప్పటివుంది. దేవుడు ఏలీయాను ఆ గుహ బైటకు పిలిచినప్పుడు "ప్రవక్త దుప్పటితో తన ముఖాన్ని కప్పుకొని" బైటకొచ్చాడు (1 రాజులు 19:13). ఏలీయా దేవుని ఆదేశాలు అనుకరిస్తూ, ఎలీషాను పిలిచినప్పుడు, "అతడు తన దుప్పటిని విసిరాడు" (1 రాజులు 19:19) అంటే, ఏలీయా స్థానంలో తాను నియమించబడినాడు అని అర్థం. ఏలీయా ఈ భూమిపై తన చిట్ట చివరి రోజు తన దుప్పటిని తన చేతి కర్రలాగ చుట్టి యొర్దానును రెండు పాయలుగా చీల్చడానికి వాడుకున్నాడు (2 రాజులు 2:8).

యిక్కడ దుప్పటి అనగానేమి? యిక్కడ అక్షర్థాం చూస్తే పొయ్యి దగ్గరలో ఉండే ఒక చిన్న అలమర అని అర్థం.[1] దీన్ని పదవిభజన చేయడంతో రకరకాల అర్థాలు కూడరావచ్చు. అయినా యిది అనుదిన వాడుక పదం కాదు.[2] ఈ "దుప్పటి" (mantle) అనే ఆంగ్ల పదం "పైన కప్పుకునే వస్త్రం" అని అర్థమిచ్చు "cloak" అనే లాటిన్ పదనుండి వచ్చింది. అంటే దీని అర్థం "వదులు వదులుగా చేతుల్లేని చొక్కాలాంటిది, పై వస్త్రాల పై ధరించే వస్త్రమది."[3] దీనికి అనగా, "దుప్పటి"కి హెబ్రీ పదం "అడ్డతెర" *addereth,* అనేదికూడ యీ విధమైన అర్థమే వస్తుంది. సహజంగా గొఱ్ఱెల కాపరి వేసుకునే పైగుడ్డలాంటిది లేక ఏదో భుజాల మీద తగిలించుకునే చొక్కాలాంటిది. అప్పుడప్పుడు ఈ మాటను ఎంతో భావయుక్తంగా రాజులు వేసుకునే రాజ దుస్తులు అన్న ఘనమైన అర్థంలో వాడతారు.[4] యిక్కడ దుప్పటి అనేమాట కౌబాయ్స్ తగిలించుకునే జుబ్బాలాంటిది, లేదా భారత దేశపు దుప్పటి, మెక్సికో వాళ్ళువేసుకొనే ఉత్తరీయం లాంటిది. లేదా మన ఉళ్ళో కప్పుకునే శాలువాలాంటిది అనే భావం వస్తుంది.

ఏలీయా అంగీ బహు నిరాడంబరమై చర్మపు చొక్కా. పూర్తిగా రోమాలతో కప్పబడి చూడ్డానికి కెంతో మొరటుగా కనిపించేదిగా ఉంటుంది. అహజ్యా పంపించిన వార్తాహరులు ఏలీయా "రోమాలు గల వ్యక్తి" అని వర్ణించాడు (2 రాజులు 1:8), యిది అతని శరీరవాలకానికి లేక అతని వస్త్రాలకు చెందిన విషయంగా భావించవచ్చు. 2 రాజులు 2:8లో ఏలీయా తన దుప్పటిని చేతి కర్రలా చుట్టి యొర్దాను మీద కొట్టడం, సెప్టుజెంట్ ప్రచురణ దీన్ని "గొఱ్ఱె చర్మం" అని చెబుతుంది. దుప్పటి అని మాత్రం చెప్పడం లేదు. యిక ఏలీయా మాదిరిని అనుసరిస్తూ అతని తదనంతరం ప్రవక్తలు చాలా ముతక మోటు రకం దుప్పట్లు

గుర్తుగా ధరించి అగుపించారు. అబద్ధ ప్రవక్తలు రోమాలుగల [*addereth*, దుప్పటి] అంగీలు ధరించినవారు, మోసగాళ్ళు అంటూ జెకర్యా తెల్పినాడు (జెకర్యా 13:4). బాప్తిస్మమిచ్చు యోహాను వచ్చినప్పుడు ఏలీయా ఆత్మతో ... వచ్చాడు (లూకా 1:17), అతడు ప్రవక్తలాగ వచ్చాడు (లూకా 7:26), "ఒంటె రోమాలతో చేయబడిన అంగీ ధరించి" వచ్చాడు (మత్తయి 3:3, 4). కాబట్టి ఏలీయా దుప్పటి గురించి ఏమని ఆలోచిస్తామంటే, అతను జంతు రోమాల వస్త్రం, బాగా ముతకబారి మొద్దుగావున్న వదులు వదులు అంగీ ఒంటిమీద వేసుకున్నాడు అని.[5]

ఏలీయా సుడిగాలిలోకి పైకెత్త బడినప్పుడు అతని దుప్పటి వచ్చి ఎలీషామీద[6] పడడం గురించి మొదటి పాఠంలో చూచాం. ఈ సవాలుతో ఈ పాఠ్య సరళిని ముగిద్దాం: ఆ దుప్పటి మీ *మీద* పడనివ్వండి.

## ఇశ్రాయేలులో తనవారైన స్త్రీలు పురుషులు యింకా ఉండాలని దేవుడు కోరుచున్నాడు

ఏలీయా ఎంతో సాదించినాడు. ఏలీయా రంగంలో దిగేవరకు అహాబుతో అంత ధైర్యంగా మాట్లాడగల్గిన యెహోవా ప్రవక్త ఉన్నాడా అని మనం ఆలోచించే వీలు లేదు (1 రాజులు 20). యెజెబెలు కూడ యెహోవా నిబంధనలు అనుసరించడానికి అంతగా పట్టింపులేకుండయుండేది (1 రాజులు 21వ అధ్యాయంలో గనుక తన స్వార్థం కోసం వారిని ఆటంకపరచినప్పటికి). అహాబుకున్న 400 మంది ఆస్థాన ప్రవక్తలు యెహోవా నామ పక్షంగా ఒక్క మాటైనా మాట్లాడలేదు. ఏదో కపటంగా మాట్లాడడానికైనా, నోరు మెదప లేదు (22:11, 12 చూడు), వాస్తవానికి ఈ ప్రవక్తల పాఠశాలలే ఉనికిలో ఉండేవి కావు (2 రాజులు 2:3, 5) ఏలీయా ప్రోద్బలం వలన ఎంతో బ్రహ్మాండమైన పురోభివృద్ధి జరిగింది. ఎప్పుడైతే అహాబు కుమారుడు యెహోరాము సింహాసనానికి వచ్చాడో, "అతడు తన తండ్రి నిలిపిన బయలుదేవతా స్తంభమును తీసివేసెను" (2 రాజులు 3:2).

యిదంతా సవ్యంగా జరిగిపోతుంటే యిక దేవునికి తన ప్రతినిధి అనేవాడు అవసరం లేదు అని మనం అనుకునే వీలు లేదు. ఈ బయలు ఆరాధనలు 2 రాజులు 10:18–27 వరకు, బాగానే కొనసాగినవి కాని, ఎప్పుడైతే యెహూ అనేవాడొచ్చాడో అతను ఈ బయలు ఆరాధికులందరని చెరపట్టి, "బయలు దేవతను ఇశ్రాయేలువారి మధ్య నుండకుండ నాశనము చేసెను" (28 వచనం). యింతలో వేరే దుష్టత్వం విజృంభించింది, యరొబాము యొక్క భయంకరమైన విగ్రహారాధన దీనికి జతపడింది. ఔను దేవునికి తనవాడు అన్నవాడు ఇశ్రాయేలులో కావలసివున్నాడు.

ఈ రోజున ఇశ్రాయేలులో దేవుని ప్రజలనబడిన స్త్రీలు పురుషులు కావాలి. ఇంతకంటె ముందుగా వచ్చిన వారిని గురించి ప్రభువుకు వందనములు చెప్పినారు, మరియు వారు వారి దినాల్లో ప్రజల్లో దేవుడు లేనితనాన్ని, పాపాన్ని చూస్తు సహిస్తూ కూడ ఎంతో సేవాభారంతో సత్యాన్ని బోధిస్తూ ప్రకటిస్తూ జీవించారు. వారివారి జీవితాల్లో ఎంతో సాధించారు. వారి సేవకు ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా అనేక సంఘాలు దైవిక సమాజాలు వెలిశాయి. తూర్పు తీరమునకు సువార్త ప్రకటించబడడం మనం చూస్తున్నాము. అక్కడున్న సంఘాన్ని చూస్తున్నప్పుడు మనకేమనిపిస్తుందంటే యెహోవా యిప్పటికి తనకు సమర్పించుకున్న స్త్రీ

పురుషులను కలిగియున్నాడని.

మనము అంతటితో పనైపోయింది అని చేతులు దులిపివేసుకునే పనిలేదు. అనేక ఆత్మలు చీకట్లోవున్నాయి. మన చుట్టూ ప్రపంచ వ్యాప్తంగా, మరి మనకున్న అవకాశాలు చెయిజారిపోతువుండొచ్చు కూడ. రష్యాలోఉత్తర ఐరోపాలోవున్నా స్నేహితులేమంటున్నారంటే, కమ్యూనిజం యింకా సజీవంగానేవుంది, సువార్త పనికి ద్వారాలు మూసివేయడానికి అన్ని ప్రయత్నాలు చురుగ్గా జరుగుతున్నాయి.

అమెరికాలోను యింకా యితర దేశాల్లోను "బయలు ఆరాధన" యింకా మనలను అంటిపెట్టుకొనే యున్నది. మనం రాతితో చేసిన విగ్రహాలకు మ్రొక్కము, కాని పురోభివృద్ధికి, అధికారానికి భోగభాగ్యాలకు మ్రొక్కుతాం. హెబ్రీ పత్రిక గ్రంథకర్త ఏమంటున్నాడంటే "మీకున్నదానిలో సంతృప్తులై యుండుడి" (హెబ్రీయులకు 13:5); అయితే మన ఆకర్షణ ఎటువైపు పోతుందంటే వాణిజ్య ప్రకటనలవైపు ప్రతిరోజు ఆయా పత్రికల్లో బొలోమని కేకలు పెడుతున్న వైపుగా, "మీకున్న దానిలో మీరు సంతృప్తి పడవద్దు, యింకా మీ కెంతో కావాలి!"

నిత్యము వేశ్యావృత్తి పాప కార్యాలు బయలు ఆలయాలలో జరుగుచుండగా అక్కడకు మనము వెళ్ళి ఆ హీనమైన కార్యక్రమాల్లో పాల్గొనవలసిన అవసరం లేదు. ఎందుకంటారా ఈ రోజు మన చుట్టు పెద్ద పెద్ద హోటల్స్ అని పేరుగాంచిన వాటిలో "మంచి" గృహాలు అనబడిన వాటితో కూడ హేయ కార్యాలు విస్తృతంగా జరుగుతున్నాయి. యిలాంటి లైంగిక అవినీతిని, యిలాంటి కార్యాల్లో పాల్గొనే వారిని హెచ్చరిస్తుంది "ఇట్టివాటిని చేయువారు దేవుని రాజ్యములో ప్రవేశించరు" (గలతీయులకు 5:19–21), కాని ఎంతో మందికి ఈ అవినీతి వారి అనుదిన కృత్యంగాను, అది వారి జీవిత ప్రమాణంగా మారిపోయింది. మరి దేవుని ఉద్దేశం ప్రకారం ఈ **ఎయిడ్స్** అనే మహామ్మారి మన దేశాదేశాన్నే కళ్ళు తెరిపించింది. ఈలాంటి హేయ కార్యాలకు దూరంగా ఉండడమే దీని పరిష్కార మార్గమని ఎలుగెత్తి చాటుతుంటే దాన్ని మనం పెడచెవిని బెట్టడమేగాక దానికితోడు మన పిల్లలకు హాని లేని "లైంగిక కృత్యాలు" ఎలా కొనసాగించాలో పిల్లలను కనే విధానాన్ని ఎలా నిరోధించాలి అన్న చిట్కాలు వారికి బాగా నేర్పిస్తున్నాం. ఎంత విచారకరం.

దీనికి ప్రతి ఫలంగా మన దేశాన్ని బాధకు, సిగ్గుకు, పదిమందిలో తలవంపులకు గురిచేస్తున్నాం. మరో విచారకరమైన విషయమేమంటే, ఈ పాపపూబిలో కూరుకుపోయి ఎన్ని కుటుంబాలు చిన్నాభిన్నమై పతనమై పోతున్నాయో గ్రహించలేకున్నాము!

ఈ రోజున ఇశ్రాయేలులో దేవుని స్త్రీలు, పురుషులు, బాలురు, బాలికలు యింతకు ముందుకంటె యిప్పుడు ఎక్కువ కావాలి. తన మార్గంలో నిలిచేవారు తన కోసం నిలిచే ప్రజలు దేవునికి కావాలి. తమ తమ స్వరాలను వినిపించగల ప్రజలు దేవునికి కావాలి. ఒక వారం గడిచిపోయేసరిగి, ఎంతో మంది సిలువ యోధులు ఎంతో మంది నమ్మకస్తులైన "ఇశ్రాయేలులోని తల్లులను" గురించి వినీ వినకముందే కాలగర్భంలో కలిసిపోతారు. మరి వారి స్థానంలో ఎవరు నిలుస్తారు? వారెవరు?

## దేవుడు తనకోసం ప్రత్యేకమైన పురుషులను స్త్రీలను వాడుకుంటాడు

ఏలాంటి పురుషులను స్త్రీలను దేవుడు వాడుకుంటాడు? "సిద్ధంగావున్న వారిని, యిష్టంగా

ఉన్నవారిని, సమర్థులైనవారిని" అంటూ ఆసక్తితో ప్రారంభించడానికి ముందుకొచ్చేవారిని గురించి మనం మాట్లాడతాం. దేవుడు ఎలాంటి వ్యక్తిని వాడుకోగలడో వారిని గూర్చి చర్చించడానికి ఆ పదాలు వాడుకుందాం:

మొదటిగా, తనును అర్పించుకోడానికి ఎవరు సిద్ధంగా ఉన్నారో వారిని దేవుడు వాడుకుంటాడు. ఒకసారి ఏలీయా నిరుత్సాహపడినప్పుడు దేవుడిలా అన్నాడు, "నీవు మరలా అరణ్యమార్గమున దమస్కునకు పోయి దానిలో ప్రవేశించి, ... నీకు మారుగా ప్రవక్తయైయుండుటకు ఆబేల్మెహోలావాడైన షాపాతు కుమారుడైన ఎలీషాకు అభిషేకము చేయుము" (1 రాజులు 19:15, 16). దేవునికి యింకెవరో సిద్ధంగా ఉన్నారు: అతను ఎలీషా. ఎలీషాను దేవుడు ఎందుకు, ఎలా ఏర్పాటు చేసుకున్నాడో నాకర్థం కావడం లేదు. ఇంకోవిషయం కూడ నాకర్థం కావడం లేదు, ఎలీషా తన మీద ఏలీయా దుప్పటి వేయక పూర్వమే సేవకు సమర్పించుకున్నాడా లేదా అనేది ఒకవేళ ఏలీయా దుప్పటి ఎగురుకుంటూ, ఎగురుకుంటూ వచ్చి ఎలీషా మీద పడిందా, మరి దేవుడు అతన్ని ఏర్పాటు చేసుకున్నాడా అన్న విషయాలు, ఒకవేళ ఎలీషా *సిద్ధంగా* లేకపోతే వృథా అయిపోతాయి కదా.

"ఏలీయా అచ్చటనుండి పోయిన తరువాత అతనికి షాపాతు కుమారుడైన ఎలీషా కనబడెను" (1 రాజులు 19:19ఎ). సేవకోసం ఎవరిని ఏర్పాటు చేయాలో అతను దొరికే వరకు ఏలీయా వెదికినాడు. అతన్ని అతడు తను పుట్టిపెరిగిన అనాగరిక దేశంలో కనుగొన లేదు, కాని ఎంతో ఫలభరితమైన యొర్దాను లోయలో కనుగొన్నాడు. అతను ఎక్కడో ప్రసంగం చేస్తున్నప్పుడు లేక గ్రంథపు చుట్ట పఠించుచున్నప్పుడు కనుగొనలేదు సుమా! అసలు విషయమేమంటే, చాలా దూరంనుండి ఏలీయా ఎలీషాను చూడగానే తిరిగి ఎలీషా అతనివైపు చూచాడు, యిద్దరి కళ్ళు కళ్ళు కలిశాయి. "అతడు తన ముందరనున్న పండ్రెండు అరకల యెడ్లచేత దుక్కి దున్నించుచు పండ్రెండవ అరక తాను తోలుచుండెను" (1 రాజులు 19:19బి). ఎలీషా ఒక వ్యవసాయదారుడు. యు. యస్. రెస్టోరేషన్ మూమెంట్ సమయంలో అంతా బోధకులే ఎక్కడ అవకాశం వస్తే అక్కడ శ్రమ అనుకోకుండ ప్రకటించారు. చెమటోర్చి పని చేశారు. ఎవరైనా సరే వారు గనుక సిద్ధంగావుంటే దేవుడు వాడుకుంటాడు.

"ఏలీయా అతనిని చేరబోయి తన దుప్పటిని అతని మీద వేసెను"[7] (1 రాజులు 19:20ఎ). బహుశ ఎలీషాకిది ఎంతో ఆశ్చర్యం కలిగించే తరుణమై యుండవచ్చు. ఎలీషా ఏలీయాను గురించి వినడం వాస్తవమేగాని వారిద్దరు ఎప్పుడు కలుసుకున్నట్లు లేదు. ఒక రోజు ఎలీషా పొలందున్నుతుంటే ఎక్కడనుండి వూడిపడ్డాడోగాని చింత నిప్పులాంటి కళ్ళతో మొరటు వాలకంతో తారసిల్లాడు. ఒక్క సారి ఎలీషా కళ్ళలోకి చూచాడు. తనను చుట్టుకున్న దుప్పటిని తీశాడు, అబ్బో ఆ దుప్పటి అంతా చెమట కంపు, అతను ప్రయాణం చేసిన దారిపొడుగునా తగులుకున్న దుమ్ము ధూళి, అతను పడుకోడానికి తలదిండుకూడ దాన్నే వాడుకునేవాడు. కాబట్టి మరీ మాసిపోయి ఉంది. యిక ఆ మొద్దు దుప్పటిని ఒక నిమిషమైనా మాట్లాడకుండ ఏలీయా తన దుప్పటిని తీసి ఎలీషా భూజాలమీద కప్పినాడు.

ఎలీషాకు దీని అర్థమేంటో గ్రహింపు అయినట్లేవున్నది. బహుశ దేవుడు దర్శనంలో ఎలీషాకు చూపించియుండవచ్చు. ఏలీయా తన మీద దుప్పటి వేయడంలోని రహస్యం ఎలీషాకు అర్థమైయుండవచ్చు. దీని వెనుక ఏలీయాకున్న ఉన్నత్యమైన ఉద్దేశమేంటో యింకిత జ్ఞానంతో గ్రహించగలిగాడు.

ఎలీషా యొక్క స్పందన ఏమైయుంటుంది? దేవుడు తన చిత్తాన్ని నెరవేర్చడానికి ఆయన మనలను బలవంతం చేయడు. దేవుడు మనలను నీతినియమాలు నిర్ణయించుకొనే ప్రతినిధులుగా చేశారు. మనము ఆయన వాడుకోడానికి నిర్ణయం తీసుకోగలం. లేదా వాడుకోకుండవుండడానికి కూడ నిర్ణయించుకోగలం. ఎలీషా ప్రత్యుత్తరం నిశ్చయమైనదిగా తక్షణమే చెప్పగల్గేదిగా ఉంది. "అతడు ఎడ్లను విడిచి ఏలీయావెంట పరుగెత్తి – నేను పోయి నా తలితండ్రులను ముద్దుపెట్టుకొని తిరిగి వచ్చి నిన్ను వెంబడించెదనని చెప్పెను" (1 రాజులు 19:20ఎ). ఆ దేశం ఎలాంటి ఆత్మీయ అంధకారంలో ఉందో భయంకరమైన క్యాన్సర్ మహామ్మారి దేశాన్నెలా కొరికి పారేస్తుందో చూచిన అతని హృదయం అప్పటికే ఎంతో బాధతో కుమిలిపోతుంది కూడ. "నేను వెళ్లడానికి సిద్ధంగావున్నాను!" అని అంటున్నాడు. "నాకు ఒక్క నిమిషం వెళ్ళనివ్వండి నేను తలిదండ్రులకు వీడ్కోలు చెప్పివస్తా" అంటున్నాడు.

ఎవరైనా ఒకరు యిలా అనవచ్చు, "ఒకసారి మంచి సామర్థ్యం గల శిష్యుడు ప్రభువు వద్దకు వచ్చి ప్రభువా నిన్ను నేను వెంబడిస్తాను గాని, ముందుగా నేను వెళ్లి మా కుటుంబంలో ఉన్న వారికి గుడ్‌బై చెప్పి రానివ్వండి." అప్పుడు యేసు, "నాగటి మీద చెయ్యి పెట్టి వెనుకతట్టు చూచు వాడెవడును దేవుని రాజ్యమునకు పాత్రుడుకాడని వారితో చెప్పెను" (లూకా 9:62). నేను వెళ్లి మా అమ్మనాన్నలను ముద్దుపెట్టుకొని వస్తాను అని ఎలీషా అన్నప్పుడు ఏలీయా ఏమన్నాడు, "పోయి రమ్ము, నావలన నీకు నిర్బంధము లేదని చెప్పెను" (1 రాజులు 19:20బి). యిక్కడ ఈ రెండు కేసులు, నాకు ఒకేలా ఉన్నాయి. కాని బహుశ ఎలీషా వెళ్ళడానికి అంత అత్యవసరంగా ఫీలవుతున్నాడని నేననుకోను సుమా!

ఈలాంటి అనుభవంలో యిరుక్కున్న యిద్దరిలో వారి హృదయ స్పందన ప్రాముఖ్యంగా ఉంది. యేసు తనకు కాబోయే ముగ్గురు శిష్యుల హృదయాల్ని ఒక్క సారి తొంగి చూస్తూ లూకా 9:57-62, గ్రహించిందేమంటే, వాళ్ళంతా కుంటిసాకులు చెబుతున్నారని, ఆ శిష్యులు పూర్తి సమర్పణాయుతమైన సేవకు సంసిద్ధంగా లేరని ముఖ్యంగా వారిలో యిద్దరైతే వెనువెంటనే యేసును అనుసరించడానికి సంసిద్ధంగాలేరు, భవిష్యత్తులో ఏదో వారికనుకూలమైన సమయంలో రావాలనుకుంటున్నారని గ్రహించాడు. తర్వాత జరిగిన విషయాలేమని తెలుపుతున్నాయంటే ఎలీషా ఎలాంటి సాకులు చెప్పడం లేదు. వెంటనే ఏలీయాను అనుసరించడానికి సంసిద్ధంగావున్నాడని తెలుస్తుంది.

తదనంతరం జరిగిన సంభాషణలో కూడ ఏలీయా మాటల్లో ఎలీషాను గద్దించినట్లుగా మాత్రంకాదు అనిపిస్తుంది.[8] ఎలీషా వెళ్లి తన రక్త సంబంధులందరికి వీడ్కొలు చెప్పి త్వరలో తిరిగి రావచ్చు అని ఏలీయా అతనికి అనుమతి యిస్తున్నాడేమో అనిపించవచ్చు. "నావలన ఏమి నిర్బంధము లేదు" అని ఏలీయా అనడంలో "నేను నిన్ను ప్రవక్తగా ఉండడానికే పిలిచాను, అంతమాత్రాన మీ కుటుంబంతో అన్ని సంబంధాలు తెగతెంపులు చేసుకోమని చెప్పలేదు.[9] నీవు ఏంచేస్తుంటావో వారికి చెప్పుము; తర్వాత నాతోరమ్ము."[10]

> అందుకతడు [ఎలీషా] అతనిని [ఏలీయాను] విడిచి వెళ్లి కాడియెడ్లను [వ్యవసాయం చేస్తున్న వాటిలో] తీసి, వధించి [కర్మెలు పర్వతం మీద ఏలీయా ఎద్దును అర్పించినట్టు][11] గొర్తినొగలచేత [చెక్క మ్రానుతో చేయబడిన కాడి, మరియు కళ్ళెం] వంటచేసి [బలి అర్పించిన తరువాత మిగిలిన మాంసముతో][12] జనులకు వడ్డించెను. వారు భోజనముచేసిన

తరువాత అతడు లేచి ఏలీయా వెంబడి వెళ్లి అతనికి ఉపచారము చేయుచుండెను (1 రాజులు 19:21).

ఎలీషా తన కుటుంబ సభ్యులకు స్నేహితులకు, అందరికి గొప్ప వీడ్కోలు విందు చేశాడు. ఖర్చుంతటిని అతనే స్వయంగా భరించాడు. యిక అతనికి సేవ మాత్రమే జీవనానికి ఆధారం. అతడు గతంలో తనకున్న అవకాశాన్ని జారవిడుచుకున్నాడు. ఈ సందర్భంలో మనకు మార్పు చెందిన ఎఫెసీ మాంత్రికుడు గుర్తొస్తున్నాడు, అతడు తన మాంత్రిక విద్యకు సంబంధించిన పుస్తకాలను యితర సరంజామాను కాల్చివేసినాడు బుగ్గిపాలుచేసినాడు (అపొస్తలుల కార్యములు 19:19).

"తరువాత అతడు లేచి ఏలీయా వెంబడి వెళ్ళి అతనికి ఉపచారము చేయుచుండెను" (1 రాజులు 19:21బి). ఎలీషా వెనుకంజ వేయలేదు. అతడు తన వారికి "వీడ్కోలు" చెప్పి ఏలీయా వెంబడి వెళ్లాడు, యిదెలావుందంటే, ఆరోజున జాలరులు తమతమ వలలు విడిచి పెట్టి ఎలాంటి సంకోచం లేకుండ యేసును వెంబడించిన విధంగా ఉంది (మత్తయి 4:20).

ఎలీషాను దేవుడు ఎంచుకొన్నట్లు నిన్ను ఎంచుకొంటున్నాడు – కాని అది మరో విధంగా అయియుండవచ్చు. దేవుడు నీ జీవితాన్ని తలాంతులతో నింపి, ఎంతో సమయాన్ని నీకిచ్చాడు. ఎవరూ నిర్వహించలేని పనిని చేయడానికి ఆయన అన్ని నీకు సమకూర్చి సంసిద్ధునిగా చేశాడు.

నేను అనేక అడ్డులు, ఆక్షేపణలు వింటుంటాను: "ఆ నాకేమి వరాలున్నావని"; "నేను మరీ చిన్నవాణ్ణి"; "మరీ పెద్ద వాణ్ణి"; "నా కుంటుంబ పోషణలో తలమున్కలైయున్నానండి"; "ప్రభువు కోసం నేను చేయగలిగిందేమి లేదు."

రుమేనియా దేశంలోని బ్రాస్‌వోలో నా పెద్ద కుమార్తె సిండీ ఆమె భర్త రిచ్చార్డు గార్లు మిషనెరీలుగా పని చేస్తున్నారు, వారికి వారి పిల్లల పోషణ (అంటే నా మనవళ్ళు మనమరాళ్ళు!) కూడ ఒక బాధ్యతే. అక్కడ సేవ ఎవరి ద్వారా ప్రారంభించబడిందో తెలుసా, కేవలం రిటైరయిన వృద్ధులతో ప్రారంభమైంది, వీరంతా క్రీస్తు శరీరంలో ఒక భాగంగా ఉన్న ఘనతను దక్కించుకొంటూ పదవీ విరమణ చేసినప్పటికి దేవుని సేవలోనే తరిస్తున్నారు. అదే పట్టణంలో ఒక అవివాహిత యువతి దైవ సేవలో ఆసక్తి కలిగి పని చేస్తుంది. ఆమె ఆయా దేశాల్లో దేవుని సేవ చేసిన ఒక మంచి మిషనెరీ. యువకులుగాని, వృద్ధురాలుగాని, వివాహంచేసుకున్నవారైనా, అవివాహితులైనా, సంతానం ఉన్నా, సంతాన హీనులైనా, వారికి దేవుని సేవలో తప్పక ఒక స్థానమున్నది.

కొంతమంది యిలా ఆక్షేపణచెప్పవచ్చు, "అబ్బే! అదంతా మాకు చెప్పవద్దు. అనవసరమైన విషయాల్లో మేము జోక్యం చేసుకోలేము. అంటే మేము యిక చేసేదేమీ ఉన్నట్టు మాకు కనబడ్డం లేదు" అంటారు. యిప్పుడు నా చేతిలో నా స్నేహితుడు[13] వ్రాసిన ఒక ఉత్తరం ఉంది. ఆయన వయస్సు డెబ్బై సంవత్సరాలు, ఆరోగ్యం కూడ ఏమంత బాగుండదు. అతడు ఎంతో అవిధేయత ప్రవర్తనతో తన జీవితమంతా వృథా చేసికొని ఈ మధ్యే ప్రభువువైపు తిరిగిన వ్యక్తి. ఒక ఆదివారం స్థానిక సంఘంలోని సభ్యులకు మీలో ప్రతివారు ప్రత్యేకమైన సేవ చేయడానికి సంసిద్ధులుగా ఉండండి అని ఒక సవాలు విసిరినాను. ఆ సమయంలో ఈ స్నేహితుడు ఎంతో దుఃఖంతో నాదగ్గరకొచ్చి "అయ్యా నా జీవితమంతా నాకివ్వబడిన

వరాలను వృథా చేసుకున్నాను" అన్నాడు. మరి దేవుని సేవ చేయడానికి నాకిక అవకాశం ఉన్నదా, నాకైతే ఏ సేవా విధానాన్ని ఏర్పాటు చేసుకోవాలో అర్థం కావడం లేదు అన్నాడు. దయచేసి నాకు సహాయం చేయండి అంటూ ప్రాధేయ పడ్డాడు. అతను మానసికంగా యింకా చురుగ్గానేయున్నాడు, మంచి ఇంగ్లీషు భాష ప్రవీణ్యతగలవాడు కూడ. ఎందుకంటె స్థానికంగా ఉన్న ఒక పత్రికకు ఎడిటర్‌కు అతను వ్రాసిన ఉత్తరాన్ని నేను చూచాను కాబట్టి. అందువల్ల ఆయనను మా సంఘ సమాచార పత్రికకు మంచి సందేశాలు వ్రాయవలసిందిగా కోరినాను, అంతేగాక అతనికున్న వరాలను అనేకులకు మేలుకరంగా వాడగలడా అన్న విషయాన్ని బాగా ఆలోచించవలసిందిగా ప్రోత్సహించును. తర్వాత నాకు ఒక ఉత్తరం వచ్చింది. అతడు స్థానిక పత్రికకు ఎడిటర్‌కు వ్రాసిన లేఖ దాని టైటిల్ ఏమని ఉందంటే "బహు హీనమైన, అసహ్యమైన సిగ్గుకరమైన [టి.వి.] వ్యంగ చిత్రాలను సంఘ నాయకులు ఖండించాలి." దాంట్లోని చివరి పేరా ఎలా ప్రారంభమవుతుందంటే, "మనము హాయిగా నింపాదిగా కూర్చొని మన దేశం యొక్క నాశనాన్ని కళ్ళారా చూస్తున్నామంటే మనం బాధ్యతగల ప్రజలమేనా, లేదా దాన్ని అన్ని విధాల ఖండిస్తూ యిక జరిగిన నష్టం చాలు. యిక కొనసాగడానికి వీల్లేదంటూ" వాపోతున్నామా? ఈ వ్యాసం అతను ఈనాటి మన పాఠం కోసం వ్రాశాడా అనిపిస్తుంది కదా!

దేవుడు నన్ను వాడుకుంటాడా అనేది ప్రశ్నకాదు? దానికి "ఔను" అని ఎలుగెత్తి జవాబు చెప్పవచ్చు. కాని అసలు ప్రశ్న ఏంటంటే, నీవు ఆయన చేత వాడబడుటకు సిద్ధంగా ఉన్నావా? అనేదే.

రెండవది, తనను తాను సేవకై *సిద్ధంచేసుకోడానికి* యిష్టంగా ఉన్న వ్యక్తిని దేవుడు వాడుకుంటాడు. ఎలీషా సేవకై పిలుపునందుకున్న తర్వాత ఏలీయాతో కలసి ప్రయాణించాడు, బహుశ అనేక సంవత్సరాలు ప్రయాణించాడని చెప్పవచ్చు. ఈ పంథాలో తన భవిష్యత్ సేవకై సంసిద్ధుడైనాడు. అంటే ఆయనతో కలిసి "సహ పరిచారకునిగా గాని," జంతు చర్మాలకు "సహాయక సంచాలకునిగా గాని," లేదా "తనుకూడ ఏలీయాకు వారసునిగా" పదిమందికి కనబర్చుకోవాలని గాని ప్రయత్నించలేదు. అతడు కేవలం ఒక సేవకునిగా మాత్రమే ప్రయాణం చేశాడు, "... అతడు లేచి ఏలీయా వెంబడి వెళ్లి అతనికి *ఉపచారము* చేయుచుండెను" (1 రాజులు 19:21; నొక్కి చెప్పింది నాది). 2 రాజులు 3:11లో అతడు ఏలీయా చేతులమీద నీళ్ళు పోశాడు అని చెబుతుంది; అంటే అతను అంత హీనమైన పనికూడ చేశాడని. ఒకవేళ దేవుడే మనలను వాడుకోవాలనుకుంటే మనం సేవకులిగా పని చేయడానికి సంసిద్ధులమై యుండాలి.

ఎలీషా ఎలాంటి సేవ చేస్తున్నాడంటే, కార్యనిర్వాహక అనుబంధ తర్ఫీదు పొందుతూ సేవ చేసినాడు. ఏలీయా అతనితో చెప్పిందేమంటే, "నేనేం చేస్తున్నానో బాగా గమనించు; తర్వాత నీవు చేయడానికి ప్రయత్నించు." ఈలాంటి తర్ఫీదు మీదే అనేక సంవత్సరాలు అమెరికా దేశం ఆధారపడియున్నది. జంతుజాలం పక్షులు వాటి పిల్లలకు యిలాంటి తర్ఫీదునిస్తాయి. తరచుగా యిదే మంచి తర్ఫీదు.

2 రాజులు 2లో, ఎలీషా మాటకు నది పాయలుగా చీలిపోవడం చూచిన ప్రవక్తల కుమారులు, "ఏలీయా ఆత్మ ఎలీషాపై నిలిచియున్నదని" కేకలు వేశారు (15 వచనం). ఏలీయా దుప్పటితో తాను నదిని కొట్టక ముందునుండే ఏలీయా ఆత్మను ఎలీషా అకళింపు

చేసుకున్నాడు. ఆ ఉత్తర రాజ్యాల రహదారులగుండా మార్గంలో దుమ్ముధూళి కొండలు గుట్టల గుండా ఈ అగ్ని ప్రవక్త అని పేరుగాంచిన ప్రవక్తతో కలిసి ప్రయాణం చేస్తున్నప్పుడు రోజు రోజుకు ఏలీయా ఆత్మ స్వభావంలోకి ఎలీషా మలచబడినాడు. అనేక సార్లు ఏలీయాతో కలిసి అనేక అనుభవాలు అనుభూతులు అంటే చలికి, గాలికి, అనేక వాతావరణాలకు రాత్రనక పగలనక అనుభవించిన అనుభావాల ద్వారా అసలు ప్రవక్త అంటే ఏంటో అన్న విషయాన్ని గ్రహించగల్గినాడు. మన కుటుంబంతో కలిసి ప్రయాణం చేసేటప్పుడు ప్రయాణం అలసట, ఆయాచోట్ల విడిది వసతులు ఒకరకమైన అనుభవం, లేదా బాయ్స్ స్కౌట్స్‌లో పాల్గొన్నప్పుడు భలే సరదాగ, సంబరంగ ఉంటుంది. సాహస కృత్యం అన్నట్లనిపిస్తుంది. కాని గిలాదువాడైన ఈ అడవి మనిషితో కలిసి వెన్ను తిరిగే ప్రయాణం అనుభవంతోకూడిన మరో కథ. ఏలీయాకు ఈ చిన్న చిన్న అడ్డంకులు అవరోధాల్లో నమ్మకం లేదు. ఎలీషా ఎంతో నిబ్బరంగా ఉన్నాడు. ఎప్పుడైతే దుప్పటి మీద వేసుకోవలసి వచ్చిందో ఎలీషా సంసిద్ధంగానే ఉన్నాడు.

నీవు ఆయన పనిచేయడానికి దేవుని దగ్గర పనియున్నది; ఆయన నీకు కొన్ని వరాలు శక్తి సామర్థ్యాలు అనుగ్రహించి ఆయన మహిమార్థమై వాడవలెనని కోరుచున్నాడు (మత్తయి 25). అంటే, అవి వాటంతట అవే పనిచేస్తాయని కాదు. దేనికైనా సిద్ధపాటు కావాలి – అది కొన్ని సంవత్సరాలే పట్టవచ్చు – అవి మన యజమానికొరకు వాడబడగలవు.

ఒకసారి నేను, నేను వ్రాస్తున్న సందేశానికి సహాయం కావలసి ఒక హాస్యగాడైన మంత్రగాణ్ణి ఇంటర్వ్యూ చేశాను. నేను అలా ఇంటర్వ్యూ చేస్తున్న సమయంలో అతని భార్య జోక్యం చేసుకొని, "మా ఆయనగారు ప్రదర్శనలివ్వడం మాత్రం భలేభలే సంబరంగా చేస్తాడు కాని ... కాని ... కాని ఆయనకు ... తెలియదు. తెలియదు అంటూ నీళ్ళు నములుతుంది." వెంటనే నేను కొంత జంకుకుంటూ అడిగాను, ఏంటమ్మా! అదేదో "సి" అనే పదం తెలియదు, తెలియదు అంటావ్ చెప్పరాదా? అని అడిగాను. అదికాదు సార్ ఆయనకు ముందుగా "సిద్ధపాటు, సాధన చేసుకోవడం" ఎంతో అవసరం అన్న సంగతి తెలియదు.

దేనికైనా సిద్ధపాటు చేసుకోవడం అనేది అంత ఆషామాషి విషయం కాదు, గాని దేనికైనా సిద్ధపాటు సాధకం లేకపోతే జీవితంలో మనమేమి సాధించలేము. నాకు ఫుట్‌బాల్ బంతి ఆడడం మహా యిష్టం, కాని ఓక్లహోమా పట్టణంలో మండుటెండలో రోజులకొలది ప్రాక్టీసు చేయడమంటే మహా చిరాకుగా ఉండేది. అబ్బా చెమటలు కారేవి, ఒళ్ళంతా నొప్పులు, గుండెలు అవిసిపోయేంతగా ఫీలయ్యేవాణ్ణి, ఆ విధంగా సాధన చేయడం యిష్టంగావుండేది కాదు, కాని నేను ఫుట్ బాల్ ఆట ఆడాలంటే నేను తప్పకా సిద్ధపడవలసిందే, నాకు ప్రసంగాలు చేయడం యిష్టం అందుచేత నేను అవసరమైన సిద్ధపాటు చేసుకోవడం (ముఖ్యంగా కంఠత పెట్టవలసిన వాక్యభాగాలు) చాలా యిష్టంగా తప్పని సరిగా చేసేవాణ్ణి. ఎందుకలా చేసే వాణ్ణంటే ప్రభువుకోసం చేసేది ఎంతో శ్రేష్ఠంగా ఉండాలన్నది నా ఉద్దేశం.

యిది ఎలీషా చేసిన విధానంలో ఒకటిగాని అనుసరిస్తే అది సిద్ధపాటుకు మనకు సహకరిస్తుంది: ఎవరైనా, వారు పురుషులైనా స్త్రీ అయినా ప్రభువుకు నమ్మకమైన సేవకులుగా వారున్నట్లయితే వారితో ఎక్కువ సమయాన్ని గడపడం, వారికి మీరు చేయగల్గినంత సహాయం చేయండి, సహకరించండి. మీరు చేయడంవలన నేర్చుకోగలరు. ప్రభువుకు సేవ చేయడం అనేది ఏంటో అన్న దాన్ని మీరు నేర్చుకోగలరు.

మూడవదిగా, ఎవరైతే అంతమువరకు ఓపికతో సహిస్తారో వారిని దేవుడు వాడుకుంటాడు.

ఏలీయా ఈ భుమి మీద తన ఆఖరి దినాన్ని ఎలీషాతో గడిపియున్నాడు. గిల్గాలునుండి బేతేలు, బేతేలునుండి యెరికో, అక్కడనుండి యొర్దాను నదివద్దకు వచ్చారు. ఏలీయా అతని దుప్పటిని తీసి చుట్టి నీటిపై కొట్టినాడు.[14] నీరు రెండు పాయలుగా చీలి దారిని చేసినప్పుడు ఆరిన నేలన వారు నది దాటినారు (2 రాజులు 2:8).

వారు ఆవలివైపు ఉన్నప్పుడు, "నేను నీయొద్దనుండి తీయబడకమునుపు నీకొరకు నేనేమి చేయకోరుదువో దానినడుగుము" అంటు ఏలీయా ఎలీషాను అడిగాడు (9ఎ వచనం). తన నమ్మకస్తుడైన అనుచరునికి ప్రేమ సూచకంగా వీడ్కోలు బహుమానం యివ్వాలని యిష్టపడి నాడు ఏలీయా. వెంటనే ఎలీషా, "నీకు కలిగిన ఆత్మలో రెండు పాళ్లూ నా మీదకు వచ్చునట్లు దయచేయుము" అని జవాబిచ్చాడు (9బి వచనం). ఎలీషా ఏలీయా యొక్క ఆత్మీయ వారసునిగా ఉండాలని కోరుకున్నాడు (ద్వితీయోపదేశకాండము 21).[15] ఏలీయా గనుక పైకి ఎత్తబడడం ఎలీషా గనుక చూచినట్లయితే అతని మనవి అంగీకరించబడుతుందని ఏలీయా ఎలీషాతో చెప్పియున్నాడు (10 వచనం).

11వ వచనం ఎలా ప్రారంభమవుతుందంటే, "వారు యింకా వెళ్లుచు మాట లాడుచుండగా ..." వాళ్లు దేన్ని గురించి మాట్లాడినారో తెలిసికొనగోరుచున్నావా? ఏలీయా జీవితంలో ప్రత్యేకమైన గొప్ప రోజులను గూర్చి మాట్లాడుకుంటున్నారా? లేదా ఆనాడు కర్మెలు పర్వతం మీద పోటీలో పొందిన అఖండ విజయం గురించి మాట్లాడుకుంటున్నారా? వారిద్దరు కలిసి చేసిన సేవలోని నవ్వు వచ్చిన అనుభవాలను జ్ఞాపకానికి తెచ్చుకుని బహుశ నవ్వుకొంటున్నారా.

మరలా మాట్లాడుకునుచూ వెళ్ళుచుండగా, "అగ్ని రథములు గుఱ్ఱములు" వారి మధ్యగా వచ్చి వారిద్దరిని వేరు చేశాయి. అప్పుడు ఏలీయా సుడిగాలిచేత ఆకాశమునకు ఆరోహణమాయెను. ఎలీషా ఏలీయాను గమనిస్తునేవున్నాడు. ఏలీయా ఒక్కొక్క స్థాయికి పైకి వెళ్ళడం చివరకు కనుచూపుమేరలా కనబడకుండ పోవడం జరిగింది (11బి వచనం)!

ఏలీయా అదృశ్యమైనప్పుడు, ఎలీషా తన వస్త్రము పట్టుకొని రెండు తునకలుగా చేశాడు, అంటే అది మహా దుఃఖానికి[16] కారణమని చెప్పాలి. ఈ సందర్భంలో ఎలీషా బహు దుఃఖముఖుడైనాడు, మనం కూడ మనం ప్రేమించినవారు కొనిపోబడితే ఎంతగా విలపిస్తామో అంతగా విలపించియుంటాడు. మరణించిన వ్యక్తి గనుక మంచి విశ్వాసంగల క్రైస్తవుడయున్నట్లయితే అది అతనికి ఒక విజయమైయుంటుందేమోగాని మనకదెంతో నష్టంగా వాటిల్లుతుంది. మనమెంత రోదిస్తాం (కాని "నిరీక్షణలేని యితరులవలె" మాత్రం కాదు).[17]

సుడిగాలి దుమ్ము ధూళి సద్దుమణికిపోయిన తర్వాత ఎలీషా నడుచుకుంటూ వెళ్ళి ఎక్కడనుండి ఏలీయా ఎత్తబడినాడో ఆ అస్థలానికి వెళ్ళాడు. వాస్తవానికి దుప్పటి అక్కడ పడియుండుట ఎలీషా చూచాడు.[18] అది తప్ప ఏలీయాకు సంబంధించిన ప్రతిదీ ఏలీయాతోనే వెళ్లిపోయింది. దుప్పటి మాత్రం వదిలిపెట్టబడింది. ఎలీషా దుప్పటిని తీసికొని యొర్దానునొద్దకు[19] వెళ్ళినాడు. ఆ సమయంలో అతనిలో కల్గిన మహాభావాలు అతని మనసును పూర్తిగా చలింపజేసివుంటాయి: యిక ముందుకు ఏం జరగబోతుందో జరగబోదో అనే ఎక్కడలేని ఉత్కంఠం అతన్ని కలిపివేసింది.

అతడు దుప్పటి తీసుకొని యొర్దాను దగ్గరకు వచ్చి నిలిచాడు (13 వచనం). దుప్పటిని

చుట్టి నీటిమీద[20] కొట్టి, "ఏలీయా యొక్క దేవుడైన యెహోవా ఎక్కడ ఉన్నాడనెను" (14వచనం). దేవుని యొక్క ఉనికిని గూర్చి ఎటువంటి అనుమానం ఎలీషాలో కనిపించలేదు. అతను అంటున్నాడు, "ప్రభువా నీవక్కడ ఉన్నావా? నేను రెండంతల ఆత్మను పొందియున్నానా? ఏలీయాకు నీరు పాయలుగా అయినట్టుగా నాకు కూడ పాయలవుతాయా?" ఔను అయ్యాయిగా (14బి వచనం)!

ప్రవక్తల కుమారులు జరిగినదాన్నంతా గమనిస్తునే ఉన్నారు (7 వచనం). బహుశ ఏలీయా ఎలీషాలకు అల్లంత దూరంలో ఎత్తైన ప్రదేశంనుండి ఏదో మాత్రం జరిగింది అని వారికి తెలుసు గాని అసలదేంటో రూఢిగా తెలియదు. ఏమైతేనేం యొర్దాను ఏలీయాకు పాయలైంది అతడు తూర్పుదిక్కుగా వెళ్ళిపోయాడు, ఎలీషాకు కూడ పాయలైంది అతను పశ్చిమంగా వచ్చాడు అంతే. ముగింపు చాలా బాగుగానేయున్నది.

> యెరికోదగ్గరనుండి కనిపెట్టుచుండిన ప్రవక్తల శిష్యులు అతని చూచి – ఏలీయా ఆత్మ ఎలీషామీద నిలిచియున్నదని చెప్పుకొని, అతనిని ఎదుర్కొనబోయి అతనికి సాష్టాంగ నమస్కారము చేసిరి (15 వచనం).

ఏలీయాకు[21] ఎంతో గౌరవమిచ్చిన ప్రవక్తల కుమారులు యిప్పుడు ఎలీషాకు ఆ గౌరవం యిస్తున్నారు.

ఏలీయాకు ఏమి సంభవించిందో ప్రవక్తల కుమారులకు అంత రూఢిగా తెలియదు. అప్పటివరకు జరిగిన చరిత్రలో చావకుండ పరమునకెక్కిన వ్యక్తి ఒకే ఒకడున్నాడు అని మాత్రమే వారికి తెలుసు, మరి ఏలీయాకు అది సంభవించిందా అనే దాన్ని వారు నమ్మలేక పోవుచున్నారు. వాస్తవానికైతే ఆ రోజుల్లో ఏలీయాకు ఒక మంచి పేరున్నది. అదేమంటే "యెహోవా ఆత్మ" అతన్ని అద్భుతంగా ఒక చోటనుండి మరోచోటుకు ఎత్తుకొనిపోయాడని" (1 రాజులు 18:12). యిదే మాదిరిగా దేవుడు మరో చోటుకు అతన్ని ఎత్తుకుపోయాడా అన్న ఆలోచనతోనే వారున్నారు.[22]

> అతనితో [ఎలీషాతో] ఇట్లనిరి – ఇదిగో నీ దాసులమైన మా యొద్ద ఏబదిమంది బలముగలవారున్నారు; మా మీద దయయుంచి నీ గురువును వెదకుటకు వారిని పోనిమ్ము; యెహోవా ఆత్మ అతనిని ఎత్తి యొక పర్వతము మీదనైనను లోయయందైనను వేసి యుండునేమోననిరి (16ఎ వచనం).

ప్రవక్తలు కుమారులనబడినవారు ఎలీషాకు "శిష్యులమని" తమను తాము పిలుచుకుంటున్నారు అన్న విషయాన్ని యిక్కడ గ్రహిద్దాం. ఏదైనా వెదకాలంటే వారంతా అతని అనుమతి అడిగి యున్నారు. ఏలీయా కోసం వీరు వెదకడం కేవలం వృథా ప్రయాస అని ఎలీషాకు బాగా తెలుసు. మొదట్లో అతను "వద్దు" (16బి వచనం) అన్నాడు. వారు మరీమరీ అడుగుతుంటే వారి వాలకం చూచి ఎలీషా "సిగ్గుపడవలసి" వచ్చింది (17ఎ వచనం) – వద్దన్న విషయమును పట్టు విడువకుండ చెప్పుటకు సిగ్గుపడ్డాడు. NEB ప్రచురణ "వారి మనవి తిరస్కరించడానికి అతనికి మనసులేదు." చివరకు ఎలీషా, "పంపండి" (17ఎ వచనం) అని అన్నాడు. వారు మూడు రోజులు ఏలీయా కోసం గాలించారు కాని అతన్ని కనుక్కోలేక పోయారు (17బి వచనం).

వారికోసం ఎలీషా యెరికోలో వేచియున్నాడు. వాళ్ళు తిరిగివచ్చినప్పుడు, "వెళ్లొద్దు అని నేను మీతో చెప్పలేదా" అన్నాడు (18 వచనం). అతనలా అనడంలోని అంతరార్థమేమంటే "మీరు గనుక నన్ను మీ నాయకునిగా అంగీకరిస్తునప్పుడు, నా మాటలు కూడ లక్ష్యపెట్టాలి కదా" అని అన్నాడు.

రెండు కథలు ఈ అధ్యాయంలో ప్రారంభమవుతున్నాయి. అంటే, ఏలీయా వలె ఎలీషాకుకూడ సమానమైన శక్తి సామర్థ్యాలు ఉన్నాయని చెప్పడానికి, యింకా రెండింతల ఆత్మ కల్గి శిక్షించడానికి, ఆశీర్వదించడానికి కూడ సమర్థుడైయున్నాడని తెలుపుటకు. మొదటి కథ యెరికోలోని నీటిని బాగుపరచడం. ఎలీషా యెరికో విడిచి వెళ్లక ముందు ప్రజలు అతనినుండి ఏదో పొందాలనుకున్నారు. అక్కడ నీరు చాలా చెడ్డగా ఉంది. అందుకే అక్కడ భూమి "ఫలవంతంగా" లేదు (19 వచనం). ఒక క్రొత్త కుండ మరియు ఉప్పువాడి, ఆ నీటిని శుభ్ర పరచినాడు (అక్షరార్థంగా, "బాగుపరచినాడు") (20-21 వచనాలు).

రెండవ అధ్యాయం, రెండు ఆడ ఎలుగుబంట్లు నలువది యిద్దరు అమర్యాదగల యవ్వనులను - దేవుని ప్రవక్తలను ఎగతాళి చేసిన "అల్లరి మూక" మీదకు వచ్చి పడడం గురించి చెప్పి, ముగిస్తుంది. ఈ సంఘటన దేన్ని స్పష్టం చేస్తుందంటే, ఆనాడు ఏలీయా తన శక్తిని ప్రదర్శించడానికి ఆకాశంనుండి అగ్ని ఎలా కురిపించినాడో ఈ రోజున ఎలీషాకు కూడ అంతే శక్తి ఉన్నదని దీనికర్థం. మనం తెరవెనుక ఒకటి రెండు ఎలుగుబంట్లను సిద్ధంగా ఉంచుకొని ఎవరైతే సువార్తను[23] వ్యతిరేకించారో, ఎగతాళి చేశారో వారి మీదకు వదలిపెట్టడానికి కాదు. కాని దేవునికి, దేవుని వాక్యాన్ని మనం గౌరవించాలి అన్నదాన్ని నేర్పించడానికే మనకివ్వబడింది.

ఈ అధ్యాయం ముగింపులో ఎలీషా కర్మెలు పర్వతానికి వెళ్లడం గురించి చదువుతున్నాం. అంటే తన ఆత్మను పునఃప్రారంభం[24] చేసుకోడానికి వచ్చాడు (మనం కూడ ఎప్పటికప్పుడు అలా చేయవలసి యున్నది). తర్వాత సమరయకు వచ్చాడు (25 వచనం), అక్కడే అతని స్వ గృహమున్నదన్న సంగతి సర్వ విధితమే (2 రాజులు 5:3).

మనం ఒక్కొఒక్క వచనం చదువుతూ ఎంతో పరిశీలనాత్మకంగా ముందు ఆధ్యాయాలు చదువుతుంటే, రెండు విషయాలు మన గమనాన్ని ఆకర్షిస్తాయి: (1) "ఏలీయా యొక్క దుప్పటి అతని మీద పడటం," "ద్వారా ఎలీషా ఆశీర్వదింపబడినాడు," మరియు (2) ఆ దుప్పటి తన మీద పడటం వలన అతడు బరువైన బాధ్యతను స్వీకరించవలసి వచ్చింది.

అతను ఎంతగా ఆశీర్వదించబడినాడో దానితోపాటు అతనికెంతో గౌరవ ప్రతిష్ఠలు ఆపాదించబడినవి. ప్రవక్తల కుమారులనబడినవారు అతని సేవకులం అని పిలిపించుకోడానికి ఎంతో యిష్టపడుచున్నాడు. అతని దగ్గర అసలు తీసుకొని ఆ ప్రాంతంలో వెదకడానికి వెళ్లినారు. ఈ విధానమే భవిష్యత్ అధ్యాయాల్లో కొనసాగుతుంది. 2 రాజులు 4:1లో ప్రవక్తల కుమారులు అతన్ని, ఏలీయా "సేవకుడు" అని పిలిచారు. 6:1, 2 వచనాల్లో ప్రవక్తల కుమారులు కట్టడం కోసం ఎలీషా అనుమతి అడుగుచున్నారు. వాస్తవానికి ఆ అధికారం మొదట్లో ఏలీయాకు ఈ ప్రవక్తలందరి మీద అధికారం ఉంది. ఆ అధికారమే యిప్పుడు ఎలీషాకు సంతరించింది.

ఎలీషా కూడ బరువైన బాధ్యతలు వహించినవాడే. తర్వాత పదకొండు అధ్యాయాలు ఎలీషా చేసిన ఘనకార్యాల గురించి తెల్పుచున్నాయి. యూదా రాజులు ఇశ్రాయేలు రాజుల

గురించి చెప్పేకంటే ఎలీషా గురించే ఆ అధ్యాయాల్లో మనం చూడగలం. ఉదాహరణకు 4వ అధ్యాయం అంతా అద్భుతాలతో కూడుకొనివుంది. నూనెకు సంబంధించిన అద్భుతం, ఒక ప్రవక్తకు "గోడమీద గది" కట్టించి ఆతిథ్యమిచ్చిన స్త్రీకి కుమారుడు పుట్టడం, మరియు "కుండలో విషమున్న"దాన్ని తీసివేసి తినుటకు యోగ్యంగా చేయడం మరియు కొద్ది ఆహారాన్ని అనేకులకోసం విస్తరింపజేయడంలాంటి అద్భుతాలున్నవి. 5వ అధ్యాయంలో నయమానును స్వస్థత పడడాన్ని గూర్చి ఉన్నది. 6వ అధ్యాయంలో గొడ్డలి తేలడం, సిరియా సైన్యానికి అంధత్వం కలుగజేయడం. 6 మరియు 7 అధ్యాయాల్లో కరువు అనంతరం, సిరియా ఎంతో అద్భుతంగా ఓడిపోవడం గూర్చి చదువుతాం.

ఈ విధంగా 13 అధ్యాయంలో ఎలీషా మరణాంతం వరకు ఈ కథ కొనసాగుతునేవుంది. ఎలీషా దేవుడు వాడుకునే వ్యక్తిగా చరిత్రపుటల్లో నిలిచి పోయాడు. అంతము వరకు సహింపుతో ఉన్న వ్యక్తిగా పేరుగాంచినాడు.

నీవు గనుక దేవుడు వాడుకొనుటకు సంసిద్ధంగా ఉన్నట్లయితే నీవెంతో ఆశీర్వదింపబడతావు, అంతేకాదు నీకు బరువైన బాధ్యతలివ్వబడతాయి.[25] ప్రభువు సంఘంలో[26] ఒక పెద్దగా ఉండే గొప్ప బాధ్యతకంటె మరి దేన్ని నేను ఊహించుకోలేను – అంతేకాదు 'డీకను' (సహాయకునిగా) టీచర్ లేక బోధకునిగా లేదా వేరే బాధ్యతగల దేవుని సేవకునిగా, నీవు నీ జీవితాంతం దేవుని సేవలో కొనసాగాలంటే, నీవు నీకు అందే ఆశీర్వాదాలను మాత్రమే చూచి అభిలషించవలదు. కాని దాని వెనుకవున్న గురుతర బాధ్యతలను అంగీకారంతో స్వీకరించడానికి కూడ సిద్ధంగా ఉండు.

యిక్కడ ప్రశ్న ఏంటంటే, మనం అంతము వరకు ఓర్పు కలిగివుండగలమా? ఒక సారి యేసు యిలా అన్నాడు, "మీరు నా నామము నిమిత్తము అందరిచేత ద్వేషింపబడుదురు; అంతమువరకు సహించినవాడు రక్షించబడును" (మత్తయి 10:22). ఆయన ఈ విధంగా కూడ అన్నాడని గుర్తించుకోండి, "యేసు, నాగటిమీద చెయ్యి పెట్టి వెనుకతట్టు చూచు వాడెవడును దేవుని రాజ్యమునకు పాత్రుడుకాడని వానితో చెప్పెను" (లూకా 9:62).

చివరివరకు సహించడం అంటే, అంత సుళువైన విషయం కాదు. దేవుడు మనతో ఉండి మనలను బలపర్చుచుంటానని వాగ్దానం చేశాడు (హెబ్రీయులకు 13:6). కాని ఆయన మనకు సుఖమైన జీవితాన్ని మాత్రం వాగ్దానం చేయలేదు. మీరు గనుక దేవునియొక్క పురుషునిగా, స్త్రీగా బాలునిగా లేక బాలికగా ఉండడానికి నిశ్చయించుకొన్నారంటే నేను మీకు కొన్ని తప్పనిసరి విషయాలు తెలియజేస్తాను. మీకు కొన్ని బాధ్యతలు, గొప్ప సవాళ్ళు తప్పక ఎదురౌతాయని నేను గ్యారంటీగా చెబుతున్నాను. మీకు కష్టమైన సమయాలెదురవుతాయని గ్యారంటీగా చెబుతున్నాను. పౌలు యిలా అంటున్నాడు, "అనేక శ్రమలను అనుభవించి మనము దేవుని రాజ్యములో ప్రవేశింపవలెననియు వారిని హెచ్చరించిరి" (అపొస్తలుల కార్యములు 14:22). నా పాఠ్య సరళిలో నేను ఎంతో నిష్కర్షగా ఎంతో సూటిగా ఉండాలనుకున్నానో అలావున్నాను. దేవునికి మీ జీవితం అర్పించడంలో ఎంత కష్టమైన విషయమో అన్న దాన్ని కప్పిపుచ్చి తీయతీయని మాటలతో మిమ్మల్ని మభ్య పెట్టడానికి ప్రయత్నించలేదు. దేవుని కోసం ఒంటరిగా నిలబడ్డం అంత సుళువైన విషయం కాదు. ఆ ఒంటరితనం ఎక్కడాలేని ఒంటరితనాన్ని కలిగిస్తుంది.

ఇది నాణెమునకు ఒక ప్రక్క దృశ్యం మాత్రమే. కాని ఈ లోకంలో తర్వాత నిత్యత్వంలో

గొప్ప ఆశీర్వాదాలు మీకున్నాయని గ్యారంటీగా నేను చెప్పగలను. ఆయన సన్నిధి, ఆయన శక్తి సహాయాలు యిప్పుడు నీవు అనుభవిస్తున్నావు. ఒకరోజు ప్రత్యక్షంగా ఆయన యిలా అనడం వింటావు, "భళా నమ్మకమైన మంచి దాసుడా" అని (మత్తయి 25:21, 23, KJV)!

## ముగింపు

దేవుని యొక్క పురుషునిగా స్త్రీగా ఇశ్రాయేలులో ఉండడం ఎంతో ప్రత్యేకమైన మంచి విషయం. "అలాంటి వ్యక్తిగా నీవుండాలంటే, నీవు సిద్ధంగా, ఇష్టంగా, సమర్థునిగా ఉండాలి." దేవుడు వాడుకోవాలనుకొనే వ్యక్తి సిద్ధంగా ఉండాలి, తన్నుతాను ఎంతో యిష్టంగా సమర్థునిగా అంతమువరకు సహించేవాడుగా ఉండాలి. యిక్కడ ప్రశ్న ఏమంటే "నీవు సిద్ధంగావున్నావా, ఇష్టంగా, సమర్థునిగా ఉన్నావా? నీమీద దుప్పటి పడడానికి యిష్టపడుచున్నావా?

ఏలీయా దుప్పటి[27] ఏదో మోజుకోసం వేసుకునేది కాదు. ఒకవేళ అది దుమ్ముకొట్టుకొని మురికిగా ఉండొచ్చు. చెమటతో తడిసి వాసనకొడుతూవుండోచ్చు, బాగా పాతపడియున్నట్టు కనబడవచ్చు కాని అది దేవుడు తన పని నిమిత్తం పంపబడిన ఏలీయాపై ఒక గురుతుగా ఉన్నది. ఒక ఏలీయాయే గనుక ఆ దుప్పటి నీ మీద గనుక వేస్తే నీవేమి చేసియుండేవాడివోనని ప్రశ్నించుకో. నీవు ఒకవేళ అబ్బో! ఈ కంపుగొట్టే గొంగళి నామీదనుండి తీసేయండి అని అరచి యుండేవాడివేమో! లేదా నీవు, "నేను వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నాను, నా అన్ని వ్యవహారాలకు స్వస్థి చెబుతాను, దేవుడు నన్నేమి చేయమంటాడో నేను ఏ విధంగా ఉండాలని దేవుడు కోరుకుంటున్నాడో?" అలావుండగలను.

దేవుడు నిన్ను కోరుకుంటున్నాడు. నీవు ముందుగా క్రైస్తవునివై యుండాలని కోరుకొంటున్నాడు.[28] తర్వాత నీవు ఎంతో చురుకైన, సహనవంతుడవై తనకు స్వరంగా ఉండాలని కోరుకొనుచున్నాడు. నేనెంతో నిరీక్షతో ప్రార్థిస్తున్నాను. నీవు తప్పక దేవుని యొక్క దుప్పటిని నీ చుట్టూ[29] చుట్టేసుకుంటావని కదం తొక్కుతూ సేవకై ముందుకు పురోగమిస్తానని వెళ్ళతావు కదూ!

---

సూచనలు

[1]దుప్పటి "mantle" లేక "mantel" ఈ రెండు పదాలు ఒకే లాటిన్ పదమునుండి వచ్చాయి. [2]దుప్పటి గురించి పద్య రూపకంగ మన మనసులో "చీకటి అంధకారానికి సంబంధించినప్పటి" అని. ఇది కప్పుకునే ఉత్తరీయం. చుట్టుకున్న చీకటి అనికూడ అంతర్భావంతో వాడవచ్చు. [3]*Funk and Wagnalls Dictionary*, Vol. 1, (1951), s.v. "mantle." [4]యోనా 3:6. యింకొక ఉదాహరణ ఏమంటే ఆకాను అనేవాడు కోరుకొని యిష్టపడిన బబులోను వస్త్రము (యెహోషువ 7:21, 24); ఈ దుప్పటి మనకళ్ళను జిగేలుమనిపించేదిగా వుంది. [5]నీవు ఈ దుప్పటిని దృశ్యసాధనంగా వాడాలి అనుకుంటే ("దృశ్యసాధనాలు నోట్స్" చూడు) దుప్పటి అన్నది యిలా ఉంటుంది అని అందరి ముందు ప్రదర్శించు, నీ చుట్టుకూడ చుట్టుకో. [6]అక్కడ ఏలీయా దుప్పటి ఎలీషా మీద ప్రత్యక్షంగా పడడాన్ని శబ్దార్థ ప్రకారంగా మనం తీసుకోవద్దు. కాని యిక్కడ అధికారం, బాధ్యత అనే దుప్పటి అతని మీద పడిందని అంతర్థాంగా మనం గ్రహించాలి. యిక్కడ "ఒకరిమీద దుప్పటి పడడం" అనే సంప్రదాయక పదజాలం ఏలీయా ఎలీషాల ఈ అనుభవంనుండే ప్రారంభమైంది, అంటే ఏలీయా ఎలీషాను ఒక ప్రవక్తగాగుర్తించి దానికి సూచనగా దుప్పటి అతనిపై వేసి దాన్ని గౌరవప్రదంగా దృఢపరచడం అనవచ్చు. [7]నీవు గనుక దుప్పటిని దృశ్యసాధనంగా వాడుచున్నట్లయితే ఏలీయా యొక్క చేసిన పనిని ముఖాబినయం చేస్తూ అందరిముందు ప్రదర్శించు. [8]కొందరేమనుకుంటారంటే అసలు ఎలీషా ప్రవక్తగా ఉండాలన్న ఆసక్తి లూకా సువార్త 9వ అధ్యాయంలో యేసు కొందరు వ్యక్తులతో మాట్లాడిన మాటలకు సరిపోల్చబడుతున్నాయి. [9]సంపూర్ణ సేవకు సమర్పించుకున్న సేవకుడు అంశాన్ని

ఎంతో ప్రాముఖ్యంగా ఆలోచించాలి. [10]ఏలీయా మర్మంగా వాడిన పదాలనుబట్టి ఈ అర్థం కొంత విభిన్నంగా ఉండవచ్చు. కొన్ని కొన్ని ప్రమాణిక వ్యాఖ్యా గ్రంథాలను చూచిన మంచిది "భయాందోళనతో కృంగిపోయిన వారిని దేవుడు ఎలాగు నయం చేయగలడు," *Truth for Today* (August 1993), "Elijah (1 Kngs 17-19)," by David Roper.

[11]యిక్కడ "బలివ్వబడింది" అనే పదము అసలు అర్థం "వధించబడింది" అని. ఎలీషా చేసింది కూడ అదే. [12]అనేక బల్యార్పణలతో జంతువు యొక్క కొంత భాగము మాత్రమే బలిగా యివ్వబడుతుంది. మిగతా తినదగిన భాగము యాజకులు తినడానికి వదలిపెట్టబడుతుంది. [13]Allen Morris of Cleburne, Texas. [14]నీవు దుప్పటిని దృశ్యసాధనంగ వాడినట్లయితే ఏలీయా చేసిన భంగిమలు చేయుము. [15]అక్కడ యితర ప్రవక్తలున్నారు (1 రాజులు 20, 22; 2 రాజులు 2:3, 5, 7; మొదలైనవి). [16]ఆదికాండము 37:29; 2 సమూయేలు 13:19; యోబు 1:20; 2:12, మొదలైనవి). [17]1 థెస్సలొనీకయులకు 4:13ff. [18]నీవు గనుక దుప్పటిని దృశ్యసాధనంగా వాడుతుంటే అందరూ చూచునట్లు దుప్పటిని కిందకు గిరాటువేయుము. [19]ఆ దుప్పటిని నేలనుండి తీసి, దానివంక ఒక్కసారి చూచి, తిరిగి నీ భుజం మీద వేసుకో. [20]దుప్పటిని దృశ్యసాధనంగా వాడినట్లయితే ఏలీయా వలె ముఖాభినయం చేయుము.

[21]యిక్కడ ఒక ఋజువేమంటే వారు ఏలీయాతో ముఖాముఖిగా మాట్లాడ్డానికి సంకోచించారు, కాని అతని సేవకునితో మాత్రం మాట్లాడగలిగినారు (2 రాజులు 2:3, 5). [22]ఫిలిప్పి అజటస్‌కు "ఆత్మ ద్వారా కొనిపోబడినాడు" (అపొస్తలుల కార్యములు 8:39, 40). [23]"నేను వయోవృద్ధుడనని ఎవరన్నారు?" అనే పాఠం చూడు. [24]యిది మనం గమనిస్తే ఎలీషా వాడుకగా వెళ్ళే స్థలమొకటుందని తెలుస్తుంది (2 రాజులు 4:25). [25]యాకోబు 3:1లో యాకోబు స్పష్టం చేస్తున్న అంశమిది. [26]హెబ్రీయులకు 13:17. [27]నీవు గనుక దుప్పటిని దృశ్యసాధనంగా వాడినట్లయితే ముగింపులో దాన్ని అందరికి కనబడునట్లు పట్టుకో. [28]నీవు క్రైస్తవుని వవ్వాలంటే యేసు దేవుని కుమారుడని నమ్మాలి. నీ పాపాల విషయమై పశ్చాత్తాపడడం, యేసునందలి విశ్వాసాన్ని నీ నోటితో ఒప్పుకోవాలి, పాప ప్రాయశ్చిత్తానికై నీటి బాప్తిస్మం పొందాలి (మార్కు 16:16; అపొస్తలుల కార్యములు 2:38; రోమీయులకు 10:9, 10; అపొస్తలుల కార్యములు 22:16). [29]దుప్పటిని గనుక నీవు దృశ్యసాధనంగా వాడుతుంటే దాన్ని నీ భుజాలు చుట్టు చుట్టుకో.

## దృశ్య సాధనాల-నోట్స్

ఏలీయాను మరిపింపజేసే రీతిగా అతని వస్త్రధారణ ముఖ్యంగా భుజాలనుండి జాలువారే దుస్తులులాంటి వాటిని తయారన్నాచేయండి లేదా సంపాదించనైనా సంపాదించండి. నేను ఆస్ట్రేలియానుండి తెచ్చిన జంతు చర్మపు కంబళి నా దగ్గర ఉంది. మీకు కూడ ఎవరైనా మీకోసం ఏదో ఒక ముతక గోదుమవర్ణపు పెద్ద కంబళిని తయారుచేయునట్లు వారిని ప్రోత్సహించుము. ఈ పాఠంలోని ఆయా ఘట్టాలు వారికి వివరించునప్పుడు ఈ గొంగళిని ప్రదర్శించుము.

## పాఠం యొక్క సంక్షిప్త వర్ణన

**పరిచయం**

A. జీవితంలోని ఆయా దేశాలు వాటి వాటికి సంబంధించిన గుర్తింపులుగల చిహ్నాలు, అధికారపరమైన గురుతులు కలిగివుంటాయి, మరి ఏలీయాకైతే అతని దుప్పటి (1 రాజులు 19:13, 19; 2 రాజులు 2:8), అది చర్మము, రోమాలు, యింకా ఆయా పీచు ముతక పదార్థాల్లాంటి వాటితో చేయబడినది (2 రాజులు 1:8; 2:8; జెకర్యా 13:4; మత్తయి 3:3, 4).

B. ఈ మన చివరి పాఠంలో ఏలీయా సుడిగాలిచేత పెకెత్తబడినప్పుడు అతని దుప్పటి ఎలీషా మీద పడింది. యిక్కడ ఈ పాఠ్యసరళిని ఒక సవాలుతో

ముగించడానికి యిష్టపడుచున్నాము: ఈ దుప్పటి మీ మీదపడనివ్వండి.

**I. ఇశ్రాయేలులో తనవారైన స్త్రీలు పురుషులు యింకా ఉండాలని దేవుడు కోరుచున్నాడు.**

A. ఏలీయా పైకెత్తబడిన తర్వాత దేవుడు యింకా తన మనిషిని ఇశ్రాయేలునుండి కోరుకుంటున్నాడు.

1. ఏలీయా ఒక గొప్ప పనిచేశాడు.

a. ఏలీయా రంగ ప్రవేశం చేయించక ముందు, యెహోవాను ప్రజలు, అసలు పెదవులతోనైనా ఒక మాటతోనైనా ఆరాధించియుంటారా అనే విషయం ఆలోచించడానికి కూడ వీల్లేకుండవుంది; కాని అతడు వచ్చింతర్వాత యెహోవా ప్రవక్తలు ఎక్కడలేని ధైర్యంతో ఆయనను స్తుతించారు. యెహోవా నామము పేర ప్రార్థించుట ప్రతి నోట మనసావాఛ ప్రభలింది. ప్రవక్తల పాఠశాలలు విస్తృతంగా స్థాపించబడినవి.

b. అహాబు యొక్క కుమారుల్లో ఒకడు బయలు పవిత్ర ఆరాధనా స్తంభాలను కూల ద్రోసినాడు (2 రాజులు 3:2).

2. అంతటిలో అంతా తుడిసిపెట్టుకుపోయిందనడానికి వీల్లేదు. బయలు ఆరాధనలు కొనసాగుతునే ఉన్నాయి (2 రాజులు 10:18ff.), మరియు ఎక్కడలేని దుష్టత్వం ప్రబలింది.

B. ఇశ్రాయేలులో దేవునికి ఈ రోజు ఆయన ప్రజలు కావాలి.

1. గతంలో ఎంతో జరిగింది.

a. ప్రపంచ వ్యాప్తంగా ప్రభువు యొక్క సంఘాఫలు వెలిశాయి.

b. సువార్త ప్రపంచవ్యాప్తంగా ప్రబలింది.

2. అంతటితో పనైపోయిందని మనం చేతులు ముడుచుకొని కూర్చునే పనిలేదు.

a. ఆత్మలు యింకా చీకటిలోనే ఉన్నాయి.

b. "బయలు ఆరాధనలు" యిప్పటికి మనతోనే ఉన్నాయి: ఆస్తిపాస్తులు, అధికారము మరియు భోగభాగ్యాలను ఆరాధించడం అనే రీతిలో సాగుచున్నాం (హెబ్రీయులకు 13:5).

c. లైంగిక అవినీతి, సిగ్గుకరమైన అల్లరితో కూడిన ఆటపాటలు విస్తరించాయి (గలతీయులకు 5:19–21).

d. మన దేశం హృదయవేదనతో, బాధతో, సిగ్గుతో నిండిపోయింది. ఈ నేపధ్యంలో వేలాది వేల కుటుంబాలు పతనమై పోతున్నాయి, సర్వ నాశనమై పోతున్నాయి.

**II. దేవుడు తనకోసం ప్రత్యేకమైన పురుషులను స్త్రీలను వాడుకుంటాడు.**

A. ఎవరైతే *సిద్ధంగా* ఉంటారో వారిని దేవుడు వాడుకుంటాడు.

1. ఏలీయా తన దుప్పటిని ఎలీషా మీద విసిరినాడు దానికి ఎలీషా సంసిద్ధంగా ఉన్నాడు (1 రాజులు 19:15, 16; 19–22).
2. ఒక విధంగా చూస్తే ఆయన ఇశ్రాయేలుతో తన యొక్క పురుషునిగా, స్త్రీగా నిన్ను నన్ను ఎంచుకున్నాడు. ఆయన నీ సమయాన్ని, నీ వాదాలను, నీ జీవితాన్నే ఆయనకు సమర్పించుకోవలసిందిగా కోరుచున్నాడు. ఆయన నిన్ను వాడుకోడానికి సంసిద్ధంగావున్నావా?

B. ఎవరైతే *సంసిద్ధులై* యుంటారో వారిని దేవుడు వాడుకుంటాడు.

1. ఎలీషా సేవకై దైవాధికారిక పిలుపు అందుకున్నాడు, వాస్తవానికి ఏలీయాతో కలసి అతడు అనేక సంవత్సరాలుగా ప్రయాణం చేసినంతకాలం అతను తర్ఫీదు పొందుచున్న ప్రవక్తగానే విద్యార్థిగానే ఉన్నాడు (1 రాజులు 18:21; 2 రాజులు 3:11), ఎప్పుడైతే ఏలీయా ఆకాశమునకు కొనిపోబడినప్పుడు అతని దుప్పటి తన మీద పడినప్పటినుండి అతడు ఏలీయా పనిని చేపట్టుటకు సంసిద్ధుడైనాడు.
2. దేవుడు నీకొక పనినిచ్చాడు, అది చేయడానికి శక్తి సామర్థ్యాలనిచ్చాడు, కాని ఆ సేవ నిర్వహణకు సిద్ధపడవలసిన అవసరం ఎంతో ఉంది.

C. చివరి వరకు ఓర్పుతో సహించేవారినే దేవుడు వాడుకొంటాడు.

1. ఎలీషా మంచి పట్టుదల గల్గిన వ్యక్తి. ఏలీయా చివరి దినాన అనేక ప్రాంతాలకు ఎలీషా రాకుండ నిరాకరించ ప్రయత్నించాడు. ఎలీషా మాత్రం ఏలీయాను విడువక వెంబడిస్తూనేవున్నాడు. అందువల్లనే అతడు, “రెండంతల ఆత్మతో” ఆశీర్వదించబడినాడు, ఆత్మ అతని మీద నిలిచింది (2 రాజులు 2:8–18) తదనంతరం ఎలీషా వారి పనిని కొనసాగించినాడు, చివరివరకు నమ్మకంగా ఉన్నాడు.
   a. ఏలీయా యొక్క దుప్పటి మీదపడగానే ఎలీషా అనేక ఆశీర్వాదాలను పొందాడు. ఏలీయాకు చూపిన మర్యాద ఈ రోజు ఎలీషాకు చూపిస్తున్నారు (2 రాజులు 2:15, 16; పోల్చు 4:1; 6:1, 2).
   b. అతడు కూడ ఎన్నో బరువైన బాధ్యతలు కలిగియున్నాడు, ఎందుకంటె అక్కరల్లోవున్న వారిని ఆదుకోడానికి, దేవునికి అవిధేయులైన వారిని శిక్షించడానికి (19–25 వచనాలు).
2. దేవుడు మనలను వాడుకోదలచినప్పుడు మనమెంతో నిలకడగా ఉండాలి.
   a. ఇశ్రాయేలులో స్త్రీ పురుషులు ఆశీర్వదించబడినట్లు ఇక్కడ మనం కూడ ఆశీర్వదింపబడగలము (హెబ్రీయులకు 13:6) మరియు నిత్యంగా ఆశీర్వదింపబడగలము కూడ (మత్తయి 25:21, 23). మనము కూడ అనేక బరువైన గొప్ప బాధ్యతలు కలిగివుంటాం (యాకోబు 3:1; హెబ్రీయులకు 13:17; అపొస్తలుల కార్యములు 14:22; మొదలైనవి).
   b. మనము కూడ అంతము వరకు సహించినట్లయితే దేవుడు

మనలను తప్పక వాడుకుంటాడు (మత్తయి 10:22; లూకా 9:62).

**ముగింపు**

A. ఏ వ్యక్తి అయినా మొట్టమొదటిగా దేవుని సేవకై ఆసక్తి కనబరచినప్పుడు "సిద్ధంగా, ఇష్టంగా, సమర్ధతతో" అన్న మూడు మాటలు ఆ వ్యక్తిని గూర్చి వివరించడానికి మనం వాడతాము.

B. ఏలీయా గనుక తన దుప్పటి మీ మీద వేశాడనుకోండి మీరేమి చేస్తారు? నాకైతే మీపట్ల ఒక నమ్మకం ఉంది, "నేను వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాను!" అని మీరు చెబుతూ ఆ దుప్పటిని మీ దేహం చుట్టూ చుట్టుకొని ఎంతో ఉత్సాహంతో సేవారంగంలోకి ప్రవేశిస్తారని ఔనా!